సాక్షి
ప్రకాశం
శుక్రవారం | 17 | మార్చి | 2023



హర్యానా మద్యం.. గ్రోత్‌సెంటర్‌లో ప్రత్యక్షం

గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్లో 636 హర్యానా మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు.

- 8లో..



ఉరిమిన వరుణుడు

జిల్లావ్యాప్తంగా గురువారం అకాల వర్షం కురిసింది. పశ్చిమ ప్రకాశంలో వడగండ్ల వాన పడింది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం కురిసింది.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30 /23

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అమరజీవి పోరాట పటిమ ఆదర్శం

● పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమంలో కలెక్టర్ దినేష్‌కుమార్



పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములు పోరాట పటిమ యువతకు ఆదర్శం కావాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా స్థానిక సీవీఎన్ రీడింగ్ రూం సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న పొట్టి శ్రీరాములు.. అనంతరం భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పరచడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. అలాంటి యోధులను నేటి తరం ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహసీల్దారు మురళి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలే లక్ష్యం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్ఈ సత్యనారాయణ

పుల్లలచెరువు: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ అన్నారు. పుల్లలచెరువులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేసి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందజేయడం జరుగుతుందన్నారు. వ్యవసాయానికి 9 గంటల విద్యుత్ అందజేయడంతో పాటు గృహ వినియోగదారులకు కూడా నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయనున్నట్లు చెప్పారు. మూడు సంవత్సరాల వ్యవధిలో జిల్లాలో 27 వేల మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశామన్నారు. ఇంకా 3,500 అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు దరఖాస్తు చేసుకున్న వెంటనే ట్రాన్స్‌ఫార్మర్ అందజేయడం జరుగుతుందన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని లో వోల్టేజ్, లూజ్ వైర్లు, ఇతరత్రా మరమ్మతుల కోసం జిల్లాలో ఉన్న 7 డివిజన్లకు డివిజన్‌కు కోటి రూపాయల నిధులు మంజూరైనట్లు వివరించారు. జిల్లాలో వ్యవసాయానికి సంబంధించి రూ.140 కోట్లు, ప్రభుత్వ కార్యాలయాలకు రూ.400 కోట్ల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. జిల్లాకు నూతనంగా 18 సబ్‌స్టేషన్లు మంజూరు కాగా, వివిధ దశల్లో పనులు జరుగుతున్నాయని తెలిపారు. పుల్లలచెరువు మాజీ సర్పంచ్, ఎంపీటీసీ రాములు ఎస్ఈని కలిసి ఎస్సీపాలెంలోని విద్యుత్ సమస్యలు తెలియజేశారు. వారం రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఎస్ఈ ఆదేశించారు. ఎస్ఈ వెంట డీఈ నాగేశ్వరరావు, ఏఈ చంద్రశేఖర్ ఉన్నారు.

పేదల అభ్యున్నతికి పెద్ద పీట

● ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి



ఒంగోలు: రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో పేదల అభ్యున్నతికి పెద్ద పీట వేశారని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ... 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.2,79,279 కోట్లతో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పేదల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. వైఎస్సార్ పెన్షన్ కానుక పథకానికి రూ.21,434 కోట్లు, జగనన్న విద్యాదీవెనకు రూ.2,841 కోట్లు, వైఎస్సార్ చేయూతకు రూ.5 వేల కోట్లు, వైఎస్సార్ పంటల బీమాకు రూ.372 కోట్లు, వైఎస్సార్ సున్నావడ్డీకి రూ.1,600 కోట్లు, నేతన్న నేస్తానికి రూ.200 కోట్లు, జగనన్న తోడుకు రూ.35 కోట్లు, వైఎస్సార్ ఆసరాకు రూ.6,700 కోట్లు, వైఎస్సార్ కాపు నేస్తానికి రూ.550 కోట్లు, జగనన్న అమ్మ ఒడికి రూ.6,500 కోట్లు, జగనన్న విద్యాకానుకకు రూ.560 కోట్లు, సంక్షేమ రంగంలో బీసీలకు రూ.22,715 కోట్లు, ఈబీసీలకు రూ.6,165 కోట్లు, కాపులకు రూ.4,887 కోట్లు, ఎస్సీలకు రూ.8,384 కోట్లు, ఎస్టీలకు రూ.2,428 కోట్లు, మైనార్టీలకు రూ.4,203 కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.346 కోట్లు, క్రిస్టియన్ కార్పొరేషన్‌కు రూ.115 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.314 కోట్లు, బీసీ కార్పొరేషన్‌కు రూ.6,345 కోట్లు కేటాయించడం రాష్ట్ర బడ్జెట్ చరిత్రలోనే ప్రప్రథమమని ఎంపీ పేర్కొన్నారు.

వైఎస్సార్ సీపీ వైపే టీచర్స్..!

- విజయం దిశగా చంద్రశేఖరరెడ్డి
- తూర్పు రాయలసీమ టీచర్ ఎమ్మెల్సీ కౌంటింగ్‌లో తొలి నుంచీ ఆధిక్యం
- ఉత్కంఠగా ఓట్ల లెక్కింపు
- కొనసాగుతున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ కౌంటింగ్



ఓట్లను కట్టలు కట్టే ప్రక్రియ నిర్వహిస్తున్న సిబ్బంది

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: తూర్పు రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు అధికార వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి చంద్రశేఖరరెడ్డి విజయం దిశగా దూసుకుపోతున్నారు. తొలి రౌండు నుంచీ ఆధిక్యం సాధిస్తూ విజయంవైపు సాగారు. దీనిపై జిల్లాలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని చిత్తూరు, నెల్లూరు,ప్రకాశం జిల్లాలో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. గురువారం చిత్తూరు సమీపంలోని ఎస్వీ సెట్ లా కళాశాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరిగింది. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన ప్రక్రియ రాత్రి పది గంటల వరకూ సాగింది. మొత్తం 24,747 ఓట్లు పోలయ్యాయి. అందులో 456 ఓట్లను తిరస్కరించారు. 24,291 ఓట్లను లెక్కించారు. మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపు నాలుగు రౌండ్లలో సాగింది. అందులో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి 10,862 ఓట్లు సాధించారు. పీడీఎఫ్‌కు చెందిన పొక్కిరెడ్డి బాబురెడ్డికి 8,908 ఓట్లు రాగా, టీడీపీ మద్దతు అభ్యర్థి ఎల్‌సీ రమణారెడ్డికి 3,465 ఓట్లు వచ్చాయి. ఇంకా ఈ ఎన్నికల్లో పోటీపడిన కట్టుబోయిన బ్రహ్మానందంకు 623, గుర్రం శ్రీరామమూర్తికి 325, ధనుంజయ శివయోగికి 31, పర్వతరెడ్డి ప్రవీణకు 36, లక్కు అనసూయకు 41 ఓట్లు వచ్చాయి. మొదటి ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపులో చంద్రశేఖరరెడ్డి, బాబురెడ్డిపై 1,954 ఓట్లు ఆధిక్యం సాధించారు. నాలుగు రౌండ్ల ఓట్ల లెక్కింపు పూర్తి అయ్యే సరికి ఏ అభ్యర్థికి 50 శాతానికి పైగా ప్రాధాన్యత ఓట్లు నమోదు కాలేదు. దీంతో రాత్రి 10.30 గంటలకు రెండో ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. ప్రస్తుతం ఆ ప్రక్రియ కొనసాగుతోంది.

చెల్లుబాటు ఓట్లపై ఆశ్చర్యం..

ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో చెల్లని ఓట్లే 456 నమోదయ్యాయి. ఈ మేరకు అధికారులు ప్రకటించారు. మొత్తం 24,747 ఓట్లకు లెక్కింపు చేపట్టారు. ఇందులో 24,291ఓట్లు చెల్లుబాటు అయ్యాయని అధికారులు తెలిపారు. అయితే ఎంతో అవగాహన ఉన్న టీచర్లు చెల్లుబాటు కాని ఓట్లు వేయడం ఏమిటని పలువురు చెవులుకొరుకుతున్నారు. 456 ఓట్లల్లో కొంత మంది టిక్‌లు, రెండు సార్లు 1 సంఖ్య వేయడం, ఒకటవ ప్రాధాన్యత ఓటు వేయకుండ నేరుగా 2 ప్రాధాన్యత ఓటు నుంచి వేయడం ఇలా పలు తప్పిదాలు చేశారని కౌంటింగ్ అధికారులు గుర్తించారు.

నలుగురు అభ్యర్థులు తొలగింపు

ఉమ్మడి ప్రకాశం,నెల్లూరు, చిత్తూరు టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు 8 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో మొదటి ప్రాధాన్యత రాకపోయే 50 శాతంకు పైగా ఓట్లు నమోదుకాకపోవడంతో రెండవ ప్రాధాన్యత ఓట్లు లెక్కింపు చేపట్టారు. ఈ క్రమంలో పోల్ అయిన ఓట్లల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థుల తొలగింపు ప్రక్రియ నిర్వహించారు. తక్కువగా నమోదైన ధనంజయ శివయోగి, ప్రవీణ పర్వతరెడ్డి, లక్కు అనసూయ, శ్రీరామమూర్తి, కట్టుబోయిన బ్రహ్మానందం లను తొలగించారు. వారికి వచ్చిన ఓట్లల్లో రెండవ ప్రాధాన్యత ఓట్లు ఎవరికైతే వేశారో ఆ అభ్యర్థులకు ఓట్లను కలుపుతూ పోతారు. ఆ ఓట్లను ముందంజలో ఉన్న అభ్యర్థులకు కలిపే ప్రక్రియ నిర్వహించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే సమయంకు పోలైన ఓట్లల్లో సగభాగం కంటే ఎక్కువ వచ్చే వరకు ఓట్లను కలుపుతూ పోతారు. చివరికి ఏ అభ్యర్థికైతే ఆధిక్యం వస్తుందో ఆ అభ్యర్థిని విజేతగా ప్రకటిస్తారు. గురువారం అర్ధరాత్రి వరకు కౌంటింగ్ కొనసాగుతూనే ఉండడంతో క్షణ క్షణం ఉత్కంఠ నెలకొంది.

కౌంటింగ్ ఇలా

ప్రతి క్షణం ఉత్కంఠ నడుమ కౌంటింగ్ ప్రక్రియ కొనసాగింది. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలైన టీచర్ ఓట్లు 24,741ను 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టే ప్రక్రియ కొనసాగించారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2 గంటలకు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎన్నికల కౌంటింగ్ నిర్వహించారు. 25 చొప్పున కట్టలు కట్టిన ఓట్లను అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో అక్కడ ఏర్పాటు చేసిన 14 టేబుళ్లకు పంపిణీ చేశారు. ఒక్కో టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున 14 టేబుళ్లకు 7000 ఓట్లను అందజేశారు. అలా ఒక్కో రౌండ్‌కు ఏడు వేల ఓట్ల చొప్పున మూడు రౌండ్లలో 21,000 ఓట్లను లెక్కించారు. ఆఖరిగా నాలుగో రౌండ్‌లో 3,741 ఓట్లను లెక్కించారు. రాత్రి 10 గంటల వరకూ మొదటి ప్రాధాన్యత ఓట్లను నాలుగు రౌండ్లలో లెక్కించారు.



టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొన్న అభ్యర్థులు

పట్టభద్రుల కౌంటింగ్ సాయంత్రం ప్రారంభం...

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు 2,69,023 ఓట్లు నమోదయ్యాయి. ఎస్వీ సెట్‌లో పట్టభద్రుల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియకు పక్కా ఏర్పాట్లు చేశారు. ఆ ఎన్నికల్లో పోటీచేసిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఉదయం 7 గంటలకే కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. ఈ ఎన్నికలకు పోలైన ఓట్లను బ్యాలెట్ బాక్సుల నుంచి బయటకు తీసి డ్రమ్ముల్లో కుమ్మరించారు. పట్టభద్రులకు లక్షల్లో ఓట్లు నమోదు కావడంతో 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టేందుకు 13 గంటల వరకు సమయం పట్టింది. దీంతో ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత 5.30 గంటలకు పట్టభద్రుల మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు మొదలుపెట్టారు. ఆ కౌంటింగ్‌కు 40 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఒక్కో టేబుల్‌కు 1000 ఓట్ల చొప్పున ఒక రౌండ్‌కు 40,000 ఓట్లను లెక్కించేలా అధికారులు చర్యలు చేపట్టారు. పట్టభద్రుల ఎన్నికల ఓట్ల లెక్కింపు సంబంధించి రాత్రి 12 గంటలకు కూడా మొదటి రౌండ్ ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. మొత్తం 7 రౌండ్లలో పట్టభద్రుల ఎన్నికల ఓట్లను లెక్కించనున్నారు. ఈ ప్రక్రియ రెండో రోజు కూడా కొనసాగనుంది.

కట్టుదిట్టంగా కౌంటింగ్

- అబ్జర్వర్, ఏజెంట్ల సమక్షంలో తెరిచిన స్ట్రాంగ్ రూమ్‌లు
- కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ పహారా
- కౌంటింగ్‌లో పాల్గొన్న బరిలోని అభ్యర్థులు, ఏజెంట్లు



కొనసాగుతున్న పట్టభద్రుల ఓట్ల లెక్కింపు ప్రక్రియ

సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్: తూర్పు రాయలసీమ పరిధిలోని ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రులు, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ గురువారం కట్టుదిట్టంగా ప్రారంభమైంది. ఉదయం 7 గంటలకు కేంద్ర ఎన్నికల సంఘం నియమించిన సెక్షన్ ఆఫీసర్లు రోహిత్ కుమార్, సౌరబ్‌రానా, దీపక్‌కుమార్, అబ్జర్వర్లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్, బరిలోని అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూములు తెరిచారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్, జేసీ వెంకటేశ్వర్ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించారు. స్ట్రాంగ్ రూములు తెరిచిన వెంటనే బ్యాలెట్ బాక్సులను పట్టభద్రులు, టీచర్ కౌంటింగ్ కేంద్రాల్లోని హాల్స్ వద్దకు చేరవేశారు. అప్పటికే కౌంటింగ్ పర్సనల్స్ విధుల్లో సిద్ధంగా ఉన్నారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించారు. సీసీ కెమెరాలు, వీడియో కవరేజ్ నడుమ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించారు. ఈ కౌంటింగ్ ప్రక్రియలో జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో రాజశేఖర్, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆర్డీవో రేణుక, తిరుపతి, అన్నమయ్య జిల్లాల డీఆర్వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఐడీ కార్డు ఉంటేనే లోనికి...

కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. లోనికి వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మొదటి షిఫ్టులో సిబ్బంది విధులు నిర్వహించారు. ఆ తర్వాత రెండో షిఫ్టులో మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10 గంటల వరకు సిబ్బంది విధులు నిర్వహించి పకడ్బందీగా టీచర్ ఎమ్మెల్సీ, పట్టభద్రుల కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్ కౌంటింగ్ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఫైరింజన్, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థుల తరఫున పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, టీచర్లు, ఏజెంట్లతో కౌంటింగ్ కేంద్రం జన సందోహంగా మారింది.



బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాళ్లకు తరలిస్తున్న సిబ్బంది



సూచనలిస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్

పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయం

● వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘన నివాళి



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, ప్రజాప్రతినిధులు, నాయకులు

ఒంగోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్ సీపీ నాయకులు కొనియాడారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో అమరజీవి జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ కుప్పం ప్రసాద్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలనే ఏకైక ఆశయంతో 58 రోజులపాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలు వదిలిన త్యాగజీవి.. అమరజీవి అని అన్నారు. అటువంటి మహనీయుని ఆశయాల సాధనే లక్ష్యంగా నిత్యం కృషి చేస్తామన్నారు. నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి అమరజీవి కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేస్తూ నెల్లూరు జిల్లాకు శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాగా నామకరణం చేశారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర విభజన తర్వాత ప్రతి ఏటా నవంబర్ 1న జరుపుకునే రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జూన్ 2వ తేదీకి మార్చి అమరజీవిపై అమర్యాదగా వ్యవహరించారన్నారు. దీనిపై తాము ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేయగా.. ఆయన సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని నవంబర్ 1వ తేదీకి మార్చి విడిపోయిన రాష్ట్రం తెలంగాణ అంటూ సరైన సమాధానం ఇచ్చారన్నారు. డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దశాబ్ద కాలంగా ఆరామక్షేత్రం కోసం పడరాని పాట్లు పడుతున్నారని, ఈ నేపథ్యంలో అడిగిందే తడవుగా స్థానిక గోరంట్ల కాంప్లెక్స్ సమీపంలో రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల విలువైన స్థలాన్ని ఆర్యవైశ్యుల ఆరామ క్షేత్రానికి కేటాయించడం ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చిత్తశుద్ధికి నిదర్శనమని కృతజ్ఞతలు తెలిపారు. ఆరామక్షేత్రం కమిటీ అధ్యక్షుడు మునగా కృష్ణారావు, కార్యదర్శి అమరా శ్రీను, తడవర్తి వాసు, బాపూజీ కాంప్లెక్స్ పాలకవర్గ అధ్యక్షుడు కండేపి ప్రభాకరరావు, ఆర్ఎస్ శ్రీను మాట్లాడుతూ దశాబ్దాలుగా ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించేందుకు ముందుకొచ్చిన బాలినేని చేతుల మీదుగానే సంబంధిత స్థలంలో ఈ నెల 19న భూమిపూజకు చర్యలు చేపట్టామన్నారు.

ఉదయం 9 గంటల 9 నిముషాలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి ఆర్యవైశ్యుడు హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు పబ్బిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జి బొట్ల సుబ్బారావు, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, ఒంగోలు ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, నాయకులు గొర్రెపాటి శ్రీనివాసరావు, అయినాబత్తిన ఘనశ్యాం తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా బడ్జెట్

● మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి



మార్కాపురం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో గురువారం ప్రవేశపెట్టిన నాలుగో ఆర్థిక బడ్జెట్‌లో సంక్షేమం, అభివృద్ధికి సమానంగా ప్రాధాన్యత ఇచ్చారని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. బడ్జెట్‌పై ఆయన మాట్లాడారు. వ్యవసాయం, జల వనరులు, మహిళల సంక్షేమానికి పెద్దపీట వేశారు. అన్ని శాఖలకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదు. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత సభలో చర్చించకుండా ముందే విమర్శలు చేయడం మంచి సంప్రదాయం కాదు. ఈ బడ్జెట్‌లో పోలవరం, వెలిగొండ ప్రాజెక్టులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఈ సంవత్సరం చివరకు వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ పూర్తవుతుందని అన్నారు.

బలహీనవర్గాల బడ్జెట్

● దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్



దర్శి టౌన్: పేదల అభ్యున్నతికి మరోసారి బడ్జెట్‌లో అధికంగా కేటాయింపులు చేశారని దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. పేద, బడుగు, బలహీనవర్గాల నిజమైన ఆశాజ్యోతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారు. 2023–24 రాష్ట్ర వార్షిక బడ్జెట్ రూ.2,79,279 కోట్లలో అధికంగా సంక్షేమ పథకాలు, నవరత్నాలతో పాటు బీసీలకు రూ.22,275 కోట్లు, కాపులకు రూ.4,887 కోట్లు, ఈబీసీలకు రూ.6,165 కోట్లు, ఎస్సీలకు రూ.8,384 కోట్లు, ఎస్టీలకు రూ.2,428 కోట్లు, మైనార్టీలకు రూ.4,203 కోట్లు, బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.346 కోట్లు, క్రిస్టియన్ కార్పొరేషన్‌కు రూ.115 కోట్లు, క్షత్రియ కార్పొరేషన్‌కు రూ.314 కోట్లు, బీసీ కార్పొరేషన్‌కు రూ.6,435 కోట్లు కేటాయించడం మంచి విషయం. వ్యవసాయ రంగానికి రూ.11,589 కోట్లు, నీటిపారుదలకు రూ.11,908 కోట్లు, వైద్య రంగానికి రూ.15,582 కోట్లు, విద్యా రంగానికి రూ.31,754 కోట్లు కేటాయించడంతో పాటు అన్ని రంగాలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు.

ఇంటర్ పరీక్షకు 1,141 మంది గైర్హాజరు



ఉమామహేశ్వర జూనియర్ కాలేజీ పరీక్ష కేంద్రం వద్ద రూం నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



ఒంగోలులోని ఏకేవీకే పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



పొరపాటున వేరే పరీక్ష కేంద్రానికి వచ్చిన విద్యార్థినిని ఆమె పరీక్ష కేంద్రానికి తీసుకెళ్తున్న హెడ్‌కానిస్టేబుల్ డానియేల్

ఒంగోలు: సీనియర్ ఇంటర్ తొలిరోజు పరీక్షకు ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 1,141 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్థానిక ఆంధ్రకేసరి విద్యాకేంద్రంలో పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పరీక్ష కేంద్రంలోకి ఎవరూ సెల్‌ఫోన్ వంటి ఎల్రక్టానిక్ పరికరాలు తీసుకురారాదన్నారు. పరీక్ష కేంద్రం ఆవరణలోకి ఇతరులను అనుమతించరాదని ఆదేశించారు. క్షుణ్ణంగా అభ్యర్థులను తనిఖీ చేసిన తర్వాతే పరీక్ష కేంద్రంలోకి విద్యార్థులను అనుమతించాలన్నారు. ఒక విద్యార్థిని పరీక్ష కేంద్రంపై అవగాహన లేక ఉమామహేశ్వర కాలేజీ వద్దకు రాగా, ఆమె పరీక్ష కేంద్రం ఆంధ్ర కేసరి విద్యా కేంద్రం అని తెలిసింది. దీంతో హెడ్‌కానిస్టేబుల్ డానియేల్ ఆమెను తన బైకుపై ఎక్కించుకుని ఆంధ్రకేసరి విద్యా కేంద్రానికి తీసుకెళ్లగా సెంటర్ అది కూడా కాదని తెలిసింది. దీంతో ఆమె సెంటర్ నారాయణ జూనియర్ కాలేజీగా గుర్తించి సకాలంలో పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. విద్యార్థిని ఇబ్బందులను గుర్తించి సకాలంలో మంచి నిర్ణయం తీసుకున్నారంటూ ఎస్పీతో పాటు పోలీసు అధికారులు డానియేల్‌ను అభినందించారు. మరోవైపు ఎస్పీ మలికాగర్గ్ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలవుతున్న తీరును పరిశీలించారు. ఉదయం 8 గంటల నుంచే ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తూ ట్రాఫిక్ ఫ్రీగా ఉండేలా చర్యలు చేపట్టారు. పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు రమణారెడ్డి కొన్ని సెంటర్లను పరిశీలించగా, ఆర్ఐవో ఆరు సెంటర్లను, డీఈసీ, డీవీఈవో, హైపవర్ కమిటీ సభ్యులు 14 కేంద్రాలను, స్క్వాడ్ బృందాలు 40 సెంటర్లను తనిఖీ చేశాయి. గురువారం పరీక్షకు ఉమ్మడి ప్రకాశం జిల్లావ్యాప్తంగా 23,284 మంది జనరల్ విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 22,434 మంది రెగ్యులర్, 3,113 మంది ఒకేషనల్ విద్యార్థులకుగానూ 2,819 మంది హాజరయ్యారు. మొత్తంగా 26,397 మంది హాజరుకావాల్సి ఉండగా, 1,141 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎ.సైమన్ విక్టర్ తెలిపారు.

క్లుప్తంగా

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

పామూరు: ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన పామూరు ఎర్రచేలులో ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు.. ఎర్రచేలు ప్రాంతానికి చెందిన సయ్యద్ రమీజా ఇంట్లో ఒకటిన్నర నెల క్రితం షేక్.బాజీ (35) అనే మహిళ తన పెద్దమ్మతో కలిసి బాడుగకు చేరి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. బాజీ నివాసం ఉంటున్న పక్క ఇళ్లు ఖాళీగా ఉండగా ఆ ఇంట్లో వేరే వారు అద్దెకు చేరారు. ఇంటిని శుభ్రం చేసే క్రమంలో పక్క ఇంటి నుంచి దుర్వాసన వస్తుండటంతో విషయాన్ని ఆ ఇంటి యజమాని సయ్యద్ రమీజాకు చెప్పారు. ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ కాటూరి శ్రీనివాసరావు, సీఎస్ పురం ఎస్సై అనిల్, పామూరు ఎస్సై కె.సురేష్ యాదవ్‌లు గదిలో చూడగా షేక్.బాజీ (35) ఉరేసుకొని మృతి చెంది ఉంది. మృతురాలి బంధువు ఖాసింబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతురాలి భర్త షేక్ జమీర్, ఒకటిన్నర వయసున్న కుమార్తె అనారోగ్యంతో గతంలో మృతి చెందారు. 10 ఏళ్ల కుమారుడు మేనత్త వద్దే ఉంటున్నాడు. మృతురాలు బాజీ మానసిక ప్రవర్తన మానసికంగా సరిగా లేదని స్థానికులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి


మృతుడు లక్ష్మణ్

కనిగిరి రూరల్: విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం కనిగిరిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం..పట్టణంలోని శంఖవరానికి చెందిన శానం లక్ష్మణ్(29) వెన్నలా అపార్ట్‌మెంట్‌లోని ఓ ఇంట్లో పాలిషింగ్ వర్క్ చేస్తున్నాడు. ఈ క్రమంలో పాలిషింగ్ మిషన్ వైరు షార్ట్ సర్క్యూట్ అయి విద్యుత్ సరఫరా కావడంతో లక్ష్మణ్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దాసరి ప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

కందుకూరు: స్కూల్ బస్సు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం సింగరాయకొండ రోడ్డులోని మాల్యాద్రి కాలనీ వద్ద సంభవించింది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని నల్లమల్లివారితోటకు చెందిన మందలపు మోహన్‌రావు కుమారుడు సాయిచరణ్(27) తండ్రిని కలిసేందుకు గురువారం ఓవీ రోడ్డులోని లారీ స్టాండ్ వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి బైక్‌పై సింగరాయకొండ వెళ్తుండగా ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టింది. సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. చేతికందొచ్చిన కొడుకు మరణించడంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివనాంచారయ్య తెలిపారు.

హర్యానా మద్యం..

గ్రోత్ సెంటర్‌లో ప్రత్యక్షం

- ఆటోకు లోడ్ చేసి తరలిస్తుండగా 636 ఫుల్ బాటిళ్లు సీజ్
- పోలీసుల అదుపులో ముగ్గురు
- అక్రమ మద్యం రవాణా సూత్రధారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం
- వివరాలు వెల్లడించిన ఎస్ఈబీ జేడీ, ఏఎస్పీ నాగేశ్వరరావు



సీజ్ చేసిన మద్యాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ నాగేశ్వరరావు, ఎస్ఈబీ అధికారులు

ఒంగోలు: హర్యానా రాష్ట్రం నుంచి మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు చేరిన అక్రమ మద్యాన్ని ఎస్ఈబీ పోలీసులు బుధవారం సాయంత్రం సీజ్ చేశారు. గ్రోత్ సెంటర్ నుంచి పెద్ద మొత్తంలో మద్యాన్ని ఆటోలో తరలిస్తున్నట్లు పోలీసులకు అందిన సమాచారం మేరకు చీమకుర్తి ఎస్ఈబీ ఎస్సై నగేష్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. 750 మి.లీ పరిమాణం కలిగిన 636 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పూర్తి వివరాలను ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్, ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు గురువారం విలేకరులకు వెల్లడించారు. ఎస్పీ మలికాగర్గ్‌కు విశ్వసనీయంగా అందిన సమాచారంతో ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఎ.ఆవులయ్య, ఎస్ఈబీ ఏఈఎస్ ఎం.శ్రీధర్‌బాబు, జేడీ టీం సంయుక్తంగా దాడి చేసి అక్రమ మద్యాన్ని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. హర్యానా రాష్ట్రం నుంచి ఒక కంటైనర్‌లో మద్యం తీసుకువచ్చి గ్రోత్ సెంటర్‌లో దించారని, ఆటోలో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయించేందుకు నిందితులు ప్రయత్నిస్తున్న సమయంలో తమ సిబ్బంది దాడి చేశారని చెప్పారు. సీజ్ చేసిన 636 మద్యం బాటిళ్ల విలువ రూ.6 లక్షలుగా ఉందని పేర్కొన్నారు. నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను రాష్ట్రంలోకి అక్రమంగా తీసుకువచ్చి విక్రయించేందుకు యత్నించిన ముగ్గురితోపాటు కంటైనర్‌లో ఒంగోలుకు పంపించిన మరో వ్యక్తిపై కేసులు నమోదు చేశామన్నారు. ముగ్గురు నిందితులు తస్నీరు శబరగిరి, మొరతోటి నాగార్జున, కుంచాల ప్రవీణ్‌ను నాగులుప్పలపాడు మండలం కొత్తకోట వాసులుగా గుర్తించినట్లు తెలిపారు. కీలక సూత్రధారి అయిన ఒంగోలు వాసి, ప్రస్తుతం హర్యానా రాష్ట్రంలో ట్రాన్స్‌పోర్టు వ్యాపారం చేస్తున్న షేక్ జహీర్ అహ్మద్ అలియాస్ బాషాను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. ఆటోతో పాటు నిందితులకు చెందిన నాలుగు మొబైల్స్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను విచారించగా వారు మద్యాన్ని వేర్వేరు ప్రాంతాల్లో వ్యక్తులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు వెల్లడైందన్నారు. సమావేశంలో ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ ఎ.ఆవులయ్య, ఏఈఎస్ ఎం.సుధీర్‌బాబు, సీఐ వంశీధర్, ఎస్సైలు నగేష్, ఏఆర్ ఎస్సై శివప్రసాద్, సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు.

వెలిగొండ నిర్వాసితులకు..

వేగంగా పరిహారం


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషిక్త్‌కిషోర్

- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంతో నిర్వాసితులైన ప్రతి కుటుంబానికి వేగంగా పరిహారం అందించేందుకు పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ తన క్యాంప్ కార్యాలయంలో వెలిగొండ నిర్వాసితులకు పరిహారంపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలను గుర్తించేందుకు 2002 నుంచి 2005 వరకు అందుబాటులో ఉన్న అన్ని డాక్యుమెంట్లను మరోసారి పునఃపరిశీలించాలని సూచించారు. నిర్వాసితులమే అంటూ 1127 కుటుంబాలు సమర్పించిన పత్రాలను కేటగిరీల వారీగా పరిశీలించాలని చెప్పారు. పునరావాస, పునఃనిర్మాణ ప్యాకేజీని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. ప్యాకేజీ పొందేందుకు అర్హులైన వారు మరణిస్తే వారి నామినీల పేరుతో పరిహార ప్యాకేజీ రూపొందించాలని స్పష్టం చేశారు. అర్హుల జాబితాలో చేర్చాలంటూ వచ్చిన 137 ఫిర్యాదులను కూడా మరోసారి పరిశీలించాలన్నారు. జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ.. గొట్టిపడియ, గుండంచర్ల వాసులకు పరిహార ప్యాకేజీలకు ఆమోదం లభించాక ఇళ్ల పట్టాలు సిద్ధం చేయాలని సూచించారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సరళావందనం, కంభం యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, మార్కాపురం, కంభం యూనిట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

కూలీల ఆటోను ఢీకొట్టిన లారీ


గాయపడిన మహిళలు


క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

- 12 మందికి తీవ్ర గాయాలు.. ఒకరి పరిస్థితి విషమం
- త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి వద్ద ఘటన


శంకర్‌రెడ్డి


నరసింహ


ఆదెమ్మ


అనంతమ్మ

త్రిపురాంతకం: వ్యవసాయ పనుల నిమిత్తం కూలీలను తీసుకెళ్తున్న ఆటోను లారీ ఢీకొట్టడంతో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం తెల్లవారుజామున త్రిపురాంతకం మండలం వెల్లంపల్లి సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. త్రిపురాంతకం మండలం రాజుపాలెం నుంచి నడిగడ్డ గ్రామంలో వ్యవసాయ పనులు చేసేందుకు 12 మంది కూలీలు ఫోర్‌వీలర్ ఆటోలో బయలుదేరారు. వెల్లంపల్లి సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద ఆటో డ్రైవర్ బ్రేక్ వేసి నెమ్మదిగా వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న వారంతా తీవ్రంగా గాయపడ్డారు. బి.సీతమ్మ అపస్మారక స్థితిలో ఉంది, నాసరమ్మకు, ఆదెమ్మ, శంకరరెడ్డి, అనంతమ్మ, అంకమ్మతో పాటు బ్రహ్మంగారిమఠం నుంచి బతకుదెరువు కోసం రాజుపాలెం వచ్చిన కె.లక్ష్మీనరసింహంకు కాళ్లు విరిగాయి. మరో ముగ్గురికి తల మీద గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనం, హైవే అంబులెన్సుల్లో మార్కాపురం, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, వినుకొండలోని ఆస్పత్రులకు తరలించారు. త్రిపురాంతకం పీహెచ్‌సీలో పలువురు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం వినుకొండకు సిఫార్సు చేసినట్లు వైద్యాధికారి భాస్కర్‌రెడ్డి తెలిపారు. కాగా, గాయపడిన వారిలో ఎక్కువ మంది 50 నుంచి 60 ఏళ్ల వయసు పైబడినవారున్నారు. కుటుంబ అవసరాలకు ఆసరాగా ఉంటుందని పెద్ద వయసులోనూ కూలి పనులకు వెళ్తున్నట్లు తెలిసింది. త్రిపురాంతకం పీహెచ్‌సీలో క్షతగాత్రులను రాజుపాలెం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ జ్యోతి, మండల సచివాలయ కన్వీనర్ యల్లారెడ్డి పరామర్శించారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాంబాబు, ఎస్సై వెంకట సైదులు తెలిపారు.

ఉరిమిన వరుణుడు

పిడుగులు, వడగండ్ల బీభత్సం ● ఈదురుగాలులతో నేలకూలిన చెట్లు


త్రిపురాంతకంలో బైక్‌లపై కూలినచెట్టు


పుల్లలచెరువులో పడిన వడగండ్లు

మార్కాపురం/యర్రగొండపాలెం/త్రిపురాంతకం/పుల్లలచెరువు: ఉపరితల ద్రోణి ప్రభావంతో పశ్చిమ ప్రకాశంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు కూడిన వడగండ్ల వర్షం కురిసింది. పిడుగులు, ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

▶ మార్కాపురం, తర్లుపాడు మండలాల్లో గంట పాటు భారీ వర్షం కురిసింది. పలు చోట్ల పిడుగులు పడినా ఎటువంటి నష్టం సంభవించలేదు. పట్టణంతోపాటు పలు గ్రామాల్లో చెట్లు విరిగిపడ్డాయి.

▶ త్రిపురాంతకం మండలంలో సుమారు గంటన్నరకు పైగా వడగండ్ల వర్షం కురిసింది. బలమైన గాలులకు చెట్లు నేలకొరగడంతోపాటు ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. త్రిపురాంతకం సబ్‌స్టేషన్‌లో చెట్టు కూలి 10కి పైగా బైకులు దెబ్బతిన్నాయి. పుల్లలచెరువులోనూ గంటకు పైగా వడగండ్ల వాన కురిసింది. యర్రగొండపాలెం ప్రాంతంలో ఓ మోస్తరు వర్షం కురిసింది. ఉద్యాన తోటలకు మేలు జరుగుతుందని హెచ్‌ఓ పి.ఆదిరెడ్డి తెలిపారు.

పిడుగుపాటుకు ఒకరు మృతి

స్పృహ కోల్పోయిన మరో ఇద్దరు


మృతి చెందిన వెంకటేశ్వర్లు

యర్రగొండపాలెం: గోళ్లవిడిపి గ్రామ పొలాల్లో పిడుగుపడి ఒకరు మృతి చెందగా మరో ఇద్దరు స్పృహ కోల్పోయిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. గోళ్లవిడిపి ఎస్సీ పాలేనికి చెందిన పి.వెంకటేశ్వర్లు(42), నగేష్, నరసింహులు మిరప కోతలకు వెళ్లి వస్తుండగా వర్షం మొదలైంది. చెట్టు కిందకు వెళ్లగా అదే సమయంలో పిడుగు పడటంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. స్పృహ కోల్పోయిన నగేష్, నరసింహులు స్థానిక వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

పాకల తీరంలో టోర్నడోలు



సింగరాయకొండ: ఉపరితల ద్రోణి కారణంగా వాతావరణంలో మార్పులు సంభవించడంతో గురువారం ఉదయం పాకల సముద్ర తీరంలో టోర్నడోలు ఏర్పడ్డాయి. సముద్రంలో నీరు సుడులు తిరగుతూ మేఘాలను తాకడాన్ని ప్రత్యక్షంగా చూసిన పర్యాటకులు ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇలాంటి టోర్నడోలను ఎప్పుడూ తిలకించలేదని చెబుతూ సెల్‌ఫోన్ కెమెరాలకు పనిచెప్పారు.

సైబర్ వల.. 'సాఫ్ట్‌వేర్' విలవిల!

- ప్రాజెక్ట్ పేరుతో రూ.20 లక్షలు లూటీ
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పొదిలి పోలీసులు

పొదిలి: సైబర్ నేరగాళ్ల వలలో చిక్కిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పెద్ద మొత్తంలో నగదు కోల్పోయాడు. పొదిలికి చెందిన యువకుడిని ప్రాజెక్ట్ పేరుతో నమ్మించిన సైబర్ కేటుగాళ్లు నాలుగు దఫాల్లో ఏకంగా రూ.20 లక్షలు కాజేశారు. చివరికి తాను మోసపోయానని గ్రహించిన ఆ యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ పొదిలి పోలీసులకు ఆశ్రయించాడు. ఎస్సై మల్లికార్జున కథనం మేరకు వివరాలు.. పొదిలి పట్టణంలోని విశ్వనాథపురానికి చెందిన ఒగ్గు మోహన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సైబర్ నేరస్తులు ఓ టెలిగ్రామ్ గ్రూపులో మోహన్‌ను చేర్చుకున్నారు. పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తే అధికంగా డబ్బు సంపాదించవచ్చని నమ్మబలికారు. బాగా పనిచేస్తున్నావంటూ మోహన్‌ను అభినందిస్తూ ప్రోత్సాహకంగా తొలుత రూ.10 వేల నగదును మోహన్ ఖాతాలో ఎరగా వేశారు. గ్రూపులో మిగిలిన వారు కూడా ఎంత సంపాదించారో, వారి ఖాతాల్లో ఎంత నగదు జమ చేశారో తెలియజేస్తూ మోహన్ వాట్సాప్‌కు స్క్రీన్ షాట్లు పెట్టారు. వీటన్నింటినీ మోహన్ నమ్మాడు. ×పెద్ద ప్రాజెక్ట్ వర్క్ ఉంది. ముందుగా కొంత నగదు డిపాజిట్ చేయాల్సి ఉంటుంది₹ అని చెప్పి తొలుత రూ.5 లక్షలు తీసుకున్న సైబర్ నేరగాళ్లు.. ఆ తర్వాత మూడు దఫాల్లో రూ.15 లక్షలు గుంజారు. ప్రాజెక్ట్ ఎంతకీ ఇవ్వకపోగా మరో రూ.7 లక్షలు పంపాలని అడగడంతో మోహన్ అంగీకరించలేదు. తదనంతర పరిణామాలతో తాను మోసపోయానని గ్రహించి గురువారం రాత్రి పొదిలి పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మల్లికార్జున పేర్కొన్నారు.

అమరజీవికి సెల్యూట్

జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ మలికా గర్గ్ ఘన నివాళి


పొట్టిశ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ, ఇతర అధికారులు

ఒంగోలు: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ మలికా గర్గ్, ఇతర అధికారులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆత్మ బలిదానం చేసిన పొట్టి శ్రీరాములు జీవితం తెలుగువారందరికీ ఆదర్శనీయమన్నారు. దేశంలో భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైన మహోన్నత వ్యక్తిని స్మరించుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. అమరజీవి చరిత్ర నేటి యువతరానికి మార్గదర్శకంగా, భావితరాలకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ కె.నాగేశ్వరరావు, అశోక్‌బాబు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఏఓ ఎం.సులోచన తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పందేలు


బండ లాగుతున్న ఎద్దులు


ఎడ్ల పందేలను తిలకిస్తున్న ప్రజలు

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెలుగొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, మేకలవారిపల్లి రెడ్ల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం ఆరుపండ్ల సైజు ఫైనల్, సీనియర్ విభాగంలో ఎడ్ల బలప్రదర్శన పోటీలు కోలాహలంగా జరుగుతున్నాయి. పోటీలను ఆలయ కమిటీ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పశు సంపద అంటే ఎనలేని ఇష్టమని, ఒంగోలు జాతి గిత్తల ఖ్యాతిని మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు నిర్వహించడం అభినందనీయమని నిర్వాహకుల కృషిని కొనియాడారు. తిరునాళ్ల ప్రధానమైన రోజు కావడంతో ఎడ్ల బల ప్రదర్శన పోటీలు చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఎడ్ల ప్రాంగణం ఆవరణ పక్కనున్న కొండ పైకి జనం రావడంతో కొండ ప్రాంతం జనంతో కిక్కిరిసింది. ఆరు పండ్ల విభాగంలో 9 జతల ఎడ్లు తలపడ్డాయి. సాయంత్రం సీనియర్ విభాగంలో ఎడ్ల పోటీలు నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా వెంకటరామిరెడ్డి, ఎల్ఐసీ వెంకటరెడ్డి, బ్రహ్మరెడ్డి వ్యవహరించారు. ఎడ్ల పందేలను తిలకించేందుకు తిరునాళ్లకు వచ్చిన భక్తులకు సామాజిక అన్నదాన సత్రాల్లో భోజన వసతి కల్పించారు.

సత్తా చాటిన గిత్తలు..

ఆరు పాలపండ్ల విభాగంలో నిర్వహించిన పోటీల్లో బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లా ఎడ్లు సత్తాచాటాయి. బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజ శ్రీరెడ్డి, ఇస్సాయపాలెంకు చెందిన సంయుక్త ఎడ్లజత 5181 అడుగుల దూరం లాగి మొదటిస్థానంలో నిలిచాయి. ప్రకాశం జిల్లా ఎర్రబాలెం, గంగంపల్లి చెందిన వెంకటగిరి హేమలతనాయుడు, వేంపల్లి బాలగంగులు సంయుక్త ఎడ్లజత 4604 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచాయి. నంద్యాల జిల్లా కాంతినగరానికి చెందిన భవానీరెడ్డి, ప్రకాశం జిల్లా లింగోజీపల్లికి చెందిన భూపని మల్లయ్య సంయుక్త ఎడ్లజత 4599 అడుగులు లాగి మూడో స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా బొగ్గుల రామాంజనేయరెడ్డి ఎడ్ల జత 4546 అడుగులు లాగి నాల్గవస్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పత్తిపాడుకు చెందిన పమిడి అంజయ్యచౌదరి ఎడ్ల జత 4531 అడుగుల దూరం లాగి ఐదోస్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు బహుమతులను దాతల సహకారంతో వరుసగా రూ.35 వేలు, రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5 వేల చొప్పున అందజేశారు.